క్లుప్తంగా

వృద్ధులకు ఇంటి వద్దే రేషన్ పంపిణీ



కొవ్వూరు పట్టణంలో వృద్ధురాలికి రేషన్ బియ్యాన్ని అందజేస్తున్న ఆర్డీఓ రాణి సుస్మిత

తాళ్లపూడి (కొవ్వూరు): డివిజన్ పరిధిలోని 65 ఏళ్లు నిండిన వృద్ధులకు రేషన్ కార్డు ద్వారా పంపిణీ చేసే నిత్యవసర సరుకులు ఇక నుంచి ఇంటి వద్దే అందజేయనున్నట్టు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. కొవ్వూరు పట్టణంలో బుధవారం రేషన్ సరుకుల పంపిణీని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణంలోని నాలుగో వార్డులో 66 ఏళ్ల వృద్ధురాలు గారపాటి లక్ష్మికి రేషన్ బియ్యాన్ని అందజేశారు. ఒకటో తేదీ నుంచి ఐదో తేదీ లోగా సచివాలయ సిబ్బంది సూచనలు మేరకు రేషన్ షాప్ డీలర్ల ద్వారా వృద్ధులకు సరకులు అందజేయనున్నట్లు తెలియ చేశారు. డివిజన్ పరిధిలో 382 రేషన్ షాపుల పరిధిలో 65 ఏళ్లు నిండిన వారు ఉన్న 28,984 రేషన్ కార్డులు ఉన్నట్లు తెలిపారు.

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం



దేవరపల్లి బస్టాండ్ వద్ద శుభ్రం చేస్తున్న పరమేశు బయోటెక్ పరిశ్రమ సిబ్బంది

దేవరపల్లి: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని దేవరపల్లి–గోపాలపురం రోడ్డులో గల పరమేశు బయోటెక్ పరిశ్రమ యాజమాన్యం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టింది. దీనిలో భాగంగా బుధవారం దేవరపల్లిలోని బస్టాండ్ పరిసరాలు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిసరాలను సిబ్బంది శుభ్రం చేశారు. ఈ సందర్భంగా పరిశ్రమ జనరల్ మేనేజరు ఎస్.శివప్రసాద్ మాట్లాడుతూ గురువారం వెయ్యి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినట్టు ఆయన తెలిపారు. అటవీ అధికారులు 500 మొక్కలు, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు 500 మొక్కలు సమకూర్చినట్టు ఆయన తెలిపారు. పరిశ్రమ వద్ద కార్మికులు, సిబ్బందికి ఒక రోజు పర్యావరణంపై గురువారం సదస్సు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు.

వైభవంగా సోమేశ్వరాలయం ప్రారంభం



సోమేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న వేద పండితులు

ఉండ్రాజవరం: మండలంలో తాడిపర్రు గ్రామంలో కొలువైన పార్వతీ సమేత సోమేశ్వర స్వామి నూతన ఆలయ పునః ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం విఘ్నేశ్వర పూజ, దీక్షా ధారణ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, సాయంత్రం అంకురారోపణ, అగ్ని ప్రతిష్ఠాపన, యాగశాల ప్రవేశం, వేద మంత్రాలతో హోమాలు వంటి క్రతువులు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఓం నమ శివాయనామ స్మరణతో మార్మోగింది.

కేవీకే సేవలు వినియోగించుకోండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

తాళ్లపూడి (కొవ్వూరు): కృషి విజ్ఞాన కేంద్రం సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కేంద్రం విస్తరణ అధికారి డాక్టర్ వి.దీప్తి తెలిపారు. కొవ్వూరు మండలంలోని దొమ్మేరులో బుధవారం వికసిత కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా ముందస్తు ఖరీఫ్‌పై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా రైతులకు అరటి, మినుము, పెసర, వరి పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతుల గురించి, భూసార పరీక్షల ప్రాముఖ్యతను వివరించారు. సేంద్రియ వ్యవసాయ విధానాలు సమగ్ర ఎరువుల యాజమాన్యం గురించి వివరించారు. గేదెల పరిశోధన సంస్థ అధిపతి డాక్టర్ కె.ఆనందరావు పశు గ్రాస రకాలు గురించి, పాల ఉత్పత్తి పెరగడానికి సూచనలు, గేదెల పెంపకంలో మెళకువలను వివరించి, రైతులతో ముఖాముఖి చర్చించారు. అనంతరం సేంద్రియ విధానంలో సాగు చేస్తున్న అరటి, డ్రాగన్ ఫ్రూట్, చెరుకు క్షేత్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి, గ్రామ సహాయ అధికారి మోహన్, రైతులు పాల్గొన్నారు.



కొవ్వూరు మెయిన్ రోడ్డులో వెన్నుపోటు దినం ర్యాలీ నిర్వహిస్తున్న నియోజకవర్గ కోఆర్డినేటర్ తలారి వెంకట్రావు, పరిశీలకురాలు షర్మిలారెడ్డి, పార్టీ నాయకులు



నల్లజర్లలో ర్యాలీలో పాల్గొన్న మాజీ హోం మంత్రి వనిత, కార్యక్రమ ఇన్‌చార్జి కాకమాను రాజశేఖర్



నిడదవోలు పట్టణంలో ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్, శ్రీనివాసనాయుడు, కార్యకర్తలు

పాలనంతా వెన్నుపోట్లే

- సూపర్ సిక్స్ హామీలు గాలికి అడుగడుగునా ప్రజలకు మోసం
- కొవ్వూరు నియోజకవర్గ కోఆర్డినేటర్ తలారి, పార్టీ పరిశీలకురాలు షర్మిలారెడ్డి ధ్వజం
- భారీగా హాజరైన ప్రజలు, పార్టీ శ్రేణులు

తాళ్లపూడి (కొవ్వూరు): మాట ఇచ్చి మోసం చేయడం, వెన్నుపోటుకు చంద్రబాబు చిరునామా అని నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. కొవ్వూరులో బుధవారం పార్టీ పిలుపు మేరకు చంద్రబాబు చేసిన మోసాలు, అరాచకాలు, అన్యాయాలపై వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బుధవారం వెన్నుపోటు దినం నిరసన ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గ పరిశీలకురాలు మేడపాటి షర్మిలారెడ్డితో పాటు స్థానిక మెరక వీధివాటర్ ట్యాంక్ నుంచి మెయిన్ రోడ్డు, విజయ విహార్ సెంటర్ మీదుగా ఆర్డీఓ కార్యాలయం వరకు ప్లకార్డులు, పార్టీ జెండాలను పట్టుకుని పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో ర్యాలీ నిర్వహించారు. మార్గమధ్యంలో వైఎస్సార్, అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్, రంగా విగ్రహాలకు పూల మాలలు వేసారు. బాబు ష్యూరిటీ – వెన్నుపోటు గ్యారంటీ, బాబు వచ్చాడు –అందరినీ ముంచాడు, అమ్మ ఒడి పోయే – నాన్న బుడ్డి వచ్చే, సొంత సంపద పెంచుకున్నావు – బాబును నమ్ముకో ఉన్నదంతా అమ్ముకో, పన్నుపోటు బాబు మాకొద్దు అంటు నినాదాలు చేశారు.

అనంతరం ఆర్డీవో రాణి సుస్మితకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తలారి వెంకట్రావు మాట్లాడుతూ 2014లో చీకటి రాజ్యం చేశాడని, మళ్లీ ఎన్నికల్లో «సూపర్–6 హామీల్లను ఏడాదైనా అమలు చేయకుండా మోసం చేశారన్నారు. 2.60 లక్షల మంది వాలంటీర్లను తొలగించారని, ఇంటింటికీ రేషన్ పథకం ఎత్తేశారని, ఉచిత బస్సు, తల్లికి వందనం, రైతు భరోసా ఇలా ఏ పథకం అమలు చేయకుండా మోసాలకు చిరునామాగా మారారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే రూ.లక్ష కోట్లకు పైగా అప్పు చేసి వారి జేబుల్లో వేసుకున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగన్‌ను సీఎం చేస్తే రాష్ట్రంలో విధ్వంస పాలన పోయి సస్యశ్యామలం అవుతుందన్నారు. వైఎస్సార్ సీపీ పరిశీలకురాలు మేడపాటి షర్మిలారెడ్డి మాట్లాడుతూ మహిళల ఉసురు పోసుకున్న చంద్రబాబు వారిని కేవలం ఓటు బ్యాంక్ రాజకీయాలకు వాడుకుంటున్నాడని అన్నారు. కానీ జగనన్న మహిళలు బాగుండాలని అన్ని పథకాలు వారి పేరునే అమలు చేశారన్నారు. కూటమి పాలనలో రాష్ట్రంలోని మహిళలకు రక్షణ లేదని, ఉచిత బస్సు ఏది బాబు అని ప్రశ్నించారు. జగనన్న అందరికీ నేరుగా ఖాతాల్లో నగదు జమ చేస్తే, నేడు ఏడాదిలోనే లక్షా నలభై వేల కోట్లు అప్పులు చేయడం అభివృద్ధా అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వరరావు, తాళ్లపూడి, చాగల్లు ఎంపీపీలు జొన్నకూటి పోశిరాజు, మట్టా వీరాస్వామి, కొవ్వూరు పట్టణ అధ్యక్షుడు చిట్టూరి అన్నవరం, తాళ్లపూడి, చాగల్లు మండల కన్వీనర్లు కొలిశెట్టి నాగేశ్వరరావు, మట్టా వెంకట్రావు, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, పార్టీ కొవ్వూరు, తాళ్లపూడి, చాగల్లు మండలాల నాయకులు కంఠమని రమేష్, ముదునూరి నాగరాజు, తోట రామకృష్ణ, పిట్టా శ్రీనివాస్, వల్లభశెట్టి శ్రీనివాస్, నామా ప్రకాశం, బత్తి నాగరాజు, చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు, సుంకర సత్యనారాయణ, యాళ్ల బాబురావు, పోశిన శ్రీకృష్ణదేవరాయలు, ఉప్పులూరి సూరిబాబు, పాలమేర్ల నగేష్, కవల నాగేశ్వరరావు, పరిమి సోమరాజు, జుట్టా ఏడుకొండలు, కొమ్మిరెడ్డి నారాయణ, బట్టు సుబ్బారావు, మెణ్ణి బ్రదర్స్, చెట్టే సుభాషిణి, ముప్పిడి దయమంతి, పెద్ద సంఖ్యలో మూడు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కొవ్వూరుకు తరలి వెళ్తున్న చాగల్లు వైఎస్సార్ సీపీ శ్రేణులు

ఒక్క పథకమైనా అమలుచేశారా..

చాగల్లు: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయకుండా చంద్రబాబు ప్రజలను వెన్నుపోటు పొడిచారని ఎంపీపీ మట్టా వీరాస్వామి, పార్టీ జిల్లా ప్రధాన కార్యాదర్శి జుట్టా కొండలరావు విమర్శించారు. చంద్రబాబు మోసాలను ఎండగడుతూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బుధవారం కొవ్వూరులో తలపెట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పిలుపు మేరకు మండలం నుంచి అధిక సంఖ్యలో తరలివెళ్లారు. మండల పార్టీ అధ్యక్షులు మట్టా వెంకట్రావు మాట్లాడుతూ కల్లబొల్లి మాటలతో ప్రజలను చంద్రబాబు మభ్యపెడుతున్నారన్నారు. సర్పంచులు మద్దుకూరి రవిప్రసాద్, కుడప రాంబాబు, ముప్పిడి మహాలక్ష్ముడు, పార్టీ ఆర్టీఐ జిల్లా విభాగం అధ్యక్షులు ఇంటి వీర్రాజు, పార్టీ సీనియర్ నాయకులు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, గేడా శ్యామ్, బొర్రా రజనీ ప్రసాద్, మేకా రాజు, తాళ్లూరి సత్యనారాయణ, జాలెం వెంకట్రావు, వుండవల్లి శ్రీనివాసరావు, చీలి ప్రసాద్, మేకా సురేష్, వీరవల్లి శివ, పి.కోటీ, ఉన్నమట్ల బ్రహ్మానందం, వై.జోషి, అయినం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవోకు వినతి పత్రం అందజేస్తున్న తలారి వెంకట్రావు, షర్మిలారెడ్డి తదితరులు

నరకంలా నారావారి పాలన

- నియోజకవర్గ కోఆర్డినేటర్ తానేటి వనిత
- వెన్నుపోటు దినం కార్యక్రమ కోఆర్డినేటర్ రాజశేఖర్‌తో కలసి కూటమి పాలనపై ధ్వజం

నల్లజర్ల: ఏడాదికే కూటమి ప్రభుత్వం పతనమైందని, రాష్ట్రంలో నారావారి పాలన ప్రజలకు నరకంలా తయారైందని నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ హోంమంత్రి తానేటి వనిత ప్రభుత్వాన్ని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ సీపీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం ఉదయం నల్లజర్లలో నిర్వహించిన వెన్నుపోటుదినం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ సెంటర్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు దాదాపు కిలోమీటరున్నర దూరం పార్టీ శ్రేణులతో కలసి వచ్చి తహసీల్దార్‌కు నాయకులు వినతి పత్రం అందజేశారు. అనంతరం కార్యక్రమ ఇన్‌చార్జి, వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు కాకుమాను రాజశేఖర్‌తో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికలపుడు బాబు ష్యూరిటీ–భవిష్యత్తు గ్యారంటీ అన్నారు. ఏడాది తిరక్కుండానే బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ అని తేలిపోయిందన్నారు. జగన్ హయాంలో ఐదేళ్లలో రూ.3 లక్షల కోట్లు అప్పులు చేస్తే ఏడాదిలోనే చంద్రబాబు ప్రభుత్వం రూ.1.55 లక్షల కోట్లు అప్పులు చేసిందన్నారు. ఇంత చేసినా ఏఒక్క పథకాన్ని ప్రజలకు అందించలేక పోయిందన్నారు. మహిళలకు ఉచితబస్సు, 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1500, రైతన్నలకు ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడిసాయం, అమ్మఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి ఇలా ఏవీ అమలుకాలేదన్నారు. నాడు ఎన్టీఆర్ విషయంలో వెన్నుపోటు పొడిచి అధికారాన్ని చేజిక్కుంచుకున్నారు. అసత్య ప్రచారాలతో అలవికాని హామీలిచ్చి నేడు ప్రజలకు వెన్నుపోటు పొడిచారన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేసేవరకు ప్రజల తరపున పోరాటాలు చేస్తామన్నారు. పరిశీలకుడు రాజశేఖర్ మాట్లాడుతూ కూటమి నాయకులు, పోలీసులు ఈ కార్యక్రమానికి ఎన్ని అడ్డంకులు సృష్టించినా కార్యకర్తలు భయపడకుండా జగనన్న ఇచ్చిన పిలుపు మేరకు కార్యక్రమాన్ని విజయవంతం అయ్యిందన్నారు. కార్యక్రమంలో నల్లజర్ల, ద్వారకా తిరుమల, దేవరపల్లి, గోపాలపురం మండల కన్వీనర్లు వెల్లంకి వెంకట సుబ్రమణ్యం, ప్రతాపనేని వాసుబాబు, కూచిపూడి సతీష్, వెలగా శ్రీరామ్మూర్తి, దేవరపల్లి, నల్లజర్ల ఎంపీపీలు దుర్గారావు, బంక జయలక్ష్మి అప్పారావు, జిల్లా అధికార ప్రతినిధి గెడా జగదీష్, నరహరశెట్టి రాజేంద్రప్రసాద్, వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి తొమ్మండ్రు రమేష్, శ్రీనివాసరెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి ముప్పిడి వెంకటరత్నం, మహిళా అధ్యక్షురాలు యజ్జవరపు లక్ష్మి, ఎంపీటీసీలు మేణ్ణి వెంకటలక్ష్మి, వామిశెట్టి పావనీకుమారి, యువరాజు, కృష్ణ చౌదరి, వల్లూరి శేషగిరి, నక్కపండు, మద్దూరి ఆగేశ్వరావు, అచ్యుత వెంకటస్వామి, చిన్నీ నాగూయాదవ్, ఆందుగుల వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



గోపాలపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి నల్లజర్లకు తరలి వచ్చిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



తహసీల్దార్ నాయిడుకు వినతి పత్రం అందజేస్తున్న మాజీ హోం మంత్రి వనిత, రాజశేఖర్

భారీగా తరలిన శ్రేణులు

దేవరపల్లి: నల్లజర్లలో బుధవారం నిర్వహించిన చంద్రబాబు వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల, ద్వారకాతిరుమల మండలాల నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలి వచ్చారు. వందలాది మంది కార్యకర్తలు, నాయకులు, మహిళలు, అభిమానులు పార్టీ జెండాలను భుజాన వేసుకుని ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో దాదాపు కిలోమీటరు పొడవున పార్టీ జెండాలు రెపరెపలాడాయి. మండుటెండను సైతం లెక్కచేయకుండా పార్టీ శ్రేణులు నిరసన ప్రదర్శనలో పాల్గొని కూటమి ప్రభుత్వ విధానాలను ఎండగట్టారు. ఎస్ఆర్‌కే కళాశాల నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు సుమారు రెండు కిలో మీటర్లు భారీ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షులు కె.రాజశేఖర్, నాలుగు మండలాల అధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ విభాగాల అధ్యక్షులు, కార్యదర్శులు, కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

ఏడాదిలోనే చేతులెత్తేశారు

- కూటమి పాలనపై వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్లు డాక్టర్ గూడూరి, శ్రీనివాసనాయుడు
- నిడదవోలులో కదంతొక్కిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు

నిడదవోలు: మోసపూరిత హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం ఏడాది కాలంలోనే అన్ని విధాలా విఫలమైందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు మండిపడ్డారు. ఇచ్చిన హామీలను విస్మరించి మోసగించడంపై పట్టణంలో బుధవారం ఆయన ఆధ్వర్యంలో పార్టీ నేతలు, శ్రేణులు వెన్నుపోటు దినాన్ని నిర్వహించారు. కూటమి పాలనను నిరసిస్తూ పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. పార్టీ కార్యాలయం నుంచి చేపట్టిన ర్యాలీ గణేష్‌చౌక్ సెంటర్ మీదుగా స్థానిక తహసీల్దారు కార్యాలయం వరకు సాగింది. ర్యాలీలో ప్రభుత్వం విస్మరించిన సూపర్ సిక్స్ పథకాల ప్లకార్డులు చేతపట్టి నినాదాలు చేశారు. శ్రీనివాసనాయుడు మాట్లాడుతూ ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం ఏ హామీనీ అమలు చేయలేదన్నారు. అన్ని వర్గాలు అసంతృప్తితో ఉన్నాయని, వారిలో ఇప్పుడే చైతన్యం వస్తోందన్నారు.

ప్రజలు పడుతున్న బాధలు చూసి ప్రతిపక్షంగా వైఎస్సార్ సీపీ కదిలిందని పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ ఏడాది కాలంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాదాపు 2500 అక్రమ కేసులు బనాయించారని, సుమారు 500 మందిని జైళ్లకు పంపించడమే కాకుండా 440 మంది సోషల్ మీడియా యాక్టివిస్టులపై కేసులు బనాయించారని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అన్ని రంగాలను నిర్వీర్యం చేసిందని, ప్రజలను దగా చేసి మోసగించిందని ఆరోపిస్తూ తక్షణం హామీలను అమలు చేయాలని శ్రీనివాసనాయుడు డిమాండ్ చేశారు. ప్రజా పంపిణీ వ్యవస్థను, సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసిందని, వెన్నుపోట్లకు అలవాటైన చంద్రబాబు ఈ సారి ఏకంగా ప్రజలనే వెన్నుపోటు పొడిచారన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డాక్టర్ గూడూరి శ్రీనివాస్, జి శ్రీనివాసనాయుడులు తహసీల్దారు నాగరాజునాయక్‌కు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ టౌన్ అధ్యక్షుడు కామిశెట్టి సత్యనారాయణ, నిడదవోలు, పెరవలి మండల పార్టీ అధ్యక్షులు అయినీడి పల్లారావు, గండేపల్లి రామకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ యలగాడ బాలరాజు, ఎంపీపీలు కార్చర్ల ప్రసాద్, తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ నందిగం భాస్కరరామయ్య, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వీరమళ్ల సత్యనారాయణ, పాలేటి శరత్, పులిమంతుల రామారావు, సుంకవల్లి శ్రీహరి, గజ్జరపు రమేష్, బయ్యే కృష్ణబాబు, యలగన పోలయ్య, ఎస్‌కే చాన్‌బాషా, తోలేటి కోటేశ్వరరావు, దాకే అనిల్‌కుమార్, ఆకుల ముకుందం, కె.సూర్యనారాయణ, మడిపల్లి భాస్కరం, మద్దాల ప్రభు, బయ్యే కృష్ణబాబు, ఉర్ల హరి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తహసీల్దారు నాగరాజు నాయక్‌కు వినతిపత్రం అందిస్తున్న డాక్టర్ శ్రీనివాస్, శ్రీనివాసనాయుడు

నిరసనకు తరలిన పార్టీ శ్రేణులు

నిడదవోలు రూరల్: నిడదవోలులో బుధవారం నిర్వహించిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి మండలంలోని సమిశ్రగూడెం, శెట్టిపేట, మునిపల్లి, కోరుమామిడి, తిమ్మరాజుపాలెం నుంచి యువత మోటర్‌సైకిళ్లతో తరలివెళ్లి నిరసన ర్యాలీ నిర్వహించారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

నిడదవోలు రూరల్: మండలంలోని కాటకోటేశ్వరం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.నారాయణ అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాటకోటేశ్వరం, ఉనకరమిల్లి, సూరాపురం, కంసాలిపాలెం, తిమ్మరాజుపాలెం, లింగంపల్లి, రావిమెట్ల, శంకరాపురం గ్రామాల పరిధిలోని గృహ, వాణిజ్య వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

దేవరపల్లిలో..

దేవరపల్లి: స్థానిక విద్యుత్ సెక్షన్ పరిధిలోని బుచ్చియపాలెం, అచ్చియపాలెం గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆపరేషన్ ఈఈ ఎస్.నారాయణ అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్డీఎస్ఎస్ పనుల నిమిత్తం 33/11 కేవీ రామన్నపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ బుచ్చియపాలెం ఫీడర్ ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆయన తెలిపారు.

భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించండి

తాళ్లపూడి: బహిరంగ మార్కెట్లో ధరలు విపరీతంగా పెరిగాయని, వేతనాలు పెంచాలని డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, నిర్వాహకులు, సహాయకులు డిమాండ్ చేస్తున్నారు. మండలంలోని మలకపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద బుధవారం ఒకరోజు శిక్షణలో కార్మికులు నిరసన గళమెత్తారు. కొద్దిసేపు శిక్షణను బహిష్కరించి ధర్నా చేశారు. బహిరంగ మార్కెట్‌లో ధరలు పెరిగాయని, గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయాలని, జీతాలు పెంచాలని తదితర డిమాండ్లు చేశారు. కార్యక్రమంలో కోదాటి భాగ్యవతి, కృష్ణ కుమారి, భవాని, ఎస్.సీత, బి.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు శిక్షణ

ఈ నెల 12 నుంచి పాఠశాలలు తెరవనున్న నేపథ్యంలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన కార్మికులకు, సహాయకులకు ఒకరోజు శిక్షణ ఇచ్చారు. రాజమహేంద్రవరం డీఈఓ కార్యాలయం ఏడీ–2 వెంకటరాజు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వాహకులు, కార్మికులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో సీహెచ్ బాలామణి, ఎంఈవో–2 నెహ్రూజీ, మలకపల్లి, అన్నదేవరపేట కాంప్లెక్స్ చైర్మన్లు శ్రీవాసవి, రాధిక పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికీ పోషకాహారం

ఉండ్రాజవరం: ప్రతి విద్యార్థికి నాణ్యమైన, రుచికరమైన పోషక విలువలు కలిగిన భోజనాన్ని అందించాలని జిల్లా పరిశీలకుడు డి.అచ్యుత్‌కుమార్ సూచించారు. ఉండ్రాజవరం ఎంఈవో కార్యాలయంలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు బుధవారం ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా భోజన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎంఈవో–1 సీహెచ్ సక్సేనా రాజు మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో విద్యార్థులందరూ భోజనం చేసేలా చూడాలన్నారు. ఎంఈవో–2 డి.శారదా జ్యోత్స్న మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మెనూ తప్పక పాటిస్తూ, విద్యార్థులకు రుచిగా, శుచిగా భోజనం అందించాలన్నారు. మండల రిసోర్స్‌పర్సన్ పి.వీ రాంజనేయులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా భోజన కార్మికులకు అవగాహన కల్పించారు. జిల్లా రిసోర్స్‌పర్సన్ పి.జయలక్ష్మి మాట్లాడుతూ వంట గది, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, గ్యాస్ వాడకంపై అవగాహన కల్పించారు. తాడిపర్రు ఉన్నత పాఠశాలలో కుక్ కమ్ హెల్పర్‌గా పనిచేస్తున్న ఎ.దుర్గ మాట్లాడుతూ కుకింగ్ బిల్లులు, గౌరవ వేతనం సకాలంలో చెల్లించేలా చూడాలని కోరారు. అనంతరం భోజన కార్మికులకు వంటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.



మలకపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికులకు శిక్షణ ఇస్తున్న అధికారులు

రుచికరమైన భోజనం పెట్టండి

దేవరపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రుచికరమైన, పుష్టికరమైన ఆహారం అందించాలని ఎంపీపీ కేవీకే దుర్గారావు మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు సూచించారు. మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక అంబటి సత్యనారాయణరావు జిల్లా పరిషత్ హైస్కూలు వద్ద నిర్వాహకులకు ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఎంపీపీ కేవీకే దుర్గారావు ముఖ్య అతిథిగా పాల్గొని మెనూ ప్రకారం భోజనాన్ని అమలు చేయాలని ఆయన తెలిపారు. పిల్లలకు పెట్టే భోజనంలో రాజీ పడవద్దని ఆయన సూచించారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు తీరును అధికారులు పర్యవేక్షించాలని ఆయన కోరారు. భోజన పథకంలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని నిర్వాహకులకు ఆయన హెచ్చరించారు. కొవ్వూరు అగ్నిమాపక అధికారి వేణు మాట్లాడుతూ వంటలు చేసే సమయంలో మంటలు వ్యాపిస్తే తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. మండలంలోని 82 మంది వంట నిర్వాహకులు శిక్షణ పొందారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఏడీ వెంకటరాజు, మండల విద్యాశాఖ అధికారులు ఎం.తిరుమలదాస్, కేఆర్ఎస్‌వీవీ అప్పారావు, మండల విద్యాశాఖ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా పరిశీలకుడు అచ్యుత్‌కుమార్, ఎంఈవోలు

మూసిన ర్యాంపుల్లో తవ్వకాలు వద్దు

- కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత

తాళ్లపూడి: ఇసుక ఓపెన్ ర్యాంపుల్లో అక్టోబర్ 15 వరకు ఎటువంటి తవ్వకాలు చేయటానికి అనుమతులు లేవని ఆర్డీవో రాణి సుస్మిత పేర్కొన్నారు. తాళ్లపూడి మండలంలోని తాడిపూడిలోని ఇసుక ర్యాంపులను ఆర్డీవో రాణి సుస్మిత బుధవారం పరిశీలించారు. డివిజన్‌లో కేవలం బోట్స్ మెన్ సొసైటీ ర్యాంపులు తప్ప ఓపెన్ ఇసుక ర్యాంపులన్నింటినీ మూసేసినట్టు తెలిపారు. ఈ ర్యాంపుల్లో ఎటువంటి ఇసుక తవ్వకాలు, ఇసుక రవాణ చేయరాదన్నారు. చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మూసివేసిన ర్యాంపుల వద్ద హెచ్చరిక బోర్డులు పెట్టాలని, స్నానాలకు నిషేధమన్న బోర్డులు పెట్టాలని సిబ్బందిని ఆర్డీఓ ఆదేశించారు. కార్యక్రమంలో తాళ్లపూడి ఇన్‌చార్జి తహసీల్దార్ మోహన భారతి, ఆర్ఐ కె.రామకృష్ణ, వీఆర్వోలు పాల్గొన్నారు.



తాడిపూడి ఇసుక ర్యాంపును పరిశీలిస్తున్న ఆర్డీవో రాణి సుస్మిత

రేషన్ దుకాణం తనిఖీ

దేవరపల్లి: స్థానిక రేషన్ దుకాణాన్ని బుధవారం జిల్లా సరఫరా అధికారి రాజారమేష్ ప్రేమ్ కుమార్, ఏఎస్ఓ ఎం.నాగాంజనేయులు తనిఖీ చేశారు. 22వ నెంబరు దుకాణాన్ని తనిఖీ చేసి ప్రజలకు నిత్యావసర సరుకుల పంపిణీ విధాన్ని పరిశీలించారు. దుకాణం నిర్వహణ, రేషన్ సరుకుల పంపిణీపై డీఎస్ఓ సంతృప్తి వ్యక్తం చేశారు. రేషన్ కార్డు లబ్ధిదారులకు బియ్యం, పంచదార పంపిణీ చేశారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ డీటీ ఎం. సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.